క్లుప్తంగా

సౌకర్యాలు కల్పించాలి



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న ఏపీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి

కళ్యాణదుర్గం రూరల్ : పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, పాతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు కోరారు. శుక్రవారం పట్టణంలో డీఈఓ ప్రసాద్‌బాబుకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. ఏపీ టీచర్స్ ఫెడరేషన్ కార్యదర్శి పాతిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో మరమ్మతులు, మౌలిక వసతులు లాంటివి వెంటనే కల్పించాలన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



డీలర్లతో మాట్లాడుతున్న సీఎస్‌డీటీ లక్ష్మీదేవి

కూడేరు: రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకులను ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని సీఎస్‌డీటీ లక్ష్మీదేవి హెచ్చరించారు. శుక్రవారం కూడేరు తహసీల్దార్ కార్యాలయంలో సీఎస్‌డీటీ లక్ష్మీదేవి నిత్యావసర సరకుల పంపిణీపై డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. కేటాయించిన తేదీల్లో ఉదయం 6 గంటల నుంచే కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. అంత్యోదయ కార్డుదారులకు అర కిలో చక్కెర రూ.13.50కే ఇవ్వాలన్నారు.

ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి



డీ హీరేహాళ్‌లో ఆర్‌ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి శ్రావణ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

బొమ్మనహాళ్/డి.హీరేహాళ్: ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని డి.హీరేహాళ్ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. ఈనెల 21న 'కాసులకు కక్కుర్తి..రోగులకు విరక్తి' శీర్షికను 'సాక్షి'లో శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన వైద్యాధికారులు.. డీహీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లో ఆర్‌ఎంపీ క్లినిక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు పరిధి దాటి వైద్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలా చేసే ప్రథమ చికిత్స కేంద్రాలను సీజ్ చేయడంతో పాటు పోలీసు చర్యలకు ఆదేశిస్తామన్నారు.

డిమాండ్లు అంగీకరించాలి



రాయదుర్గంలోని రైల్వేస్టేషన్ ముందు నిరసన తెలుపుతున్న రైల్వే ఉద్యోగులు

రాయదుర్గంటౌన్: డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఆలిండియా రైల్వే మెన్ ఫెడరేషన్, సౌత్ వెస్ట్రన్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులు శుక్రవారం నిరసన తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా చేశారు. రైల్వేమెన్ ఫెడరేషన్, సౌత్ వెస్ట్రన్ రైల్వే మజ్దూర్ యూనియన్ చిత్రదుర్గం జోనల్ నాయకుడు జనార్దన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి తమ డిమాండ్లను తెలియజేసేందుకు ఫిబ్రవరి 21న ఆలిండియా రైల్వే మెన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆలిండియా డిమాండ్స్ డేగా జరుపుకున్నట్లు చెప్పారు.

శ్రీనివాస విద్యానికేతన్‌ను సందర్శించిన విదేశీయులు



విదేశీయులను సత్కరిస్తున్న శ్రీనివాస్ విద్యానికేతన్ యాజమాన్యం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలను విదేశీయులు శుక్రవారం సందర్శించారు. న్యూజిలాండ్‌కు చెందిన ట్రాన్సిడెంటల్ మెడిటేషన్ గ్లోబల్ ఆర్గనైజేషన్ అంతర్జాతీయ శిక్షకులైన మైఖేల్, డెన్మార్క్ చెందిన డోమినిక్, పేర్లేలు సందర్శించారు. వీరికి పాఠశాల కరస్పాడెంట్ శ్రీనివాసులు, హెచ్‌ఎం రమ, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. అనంతరం విదేశీయుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

సస్యరక్షణతో మేలైన దిగుబడి

- విరబూసిన మామిడి పూత
- రైతు కళ్లల్లో ఆనందం
- జాగ్రత్తగా కాపాడుకుంటేనే ప్రయోజనం



పూతతో నిండుగా కనిపిస్తున్న మామిడిచెట్టు



మామిడి దిగుబడిపై రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న అధికారులు

రాయదుర్గం: వేరుశనగ, ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా రైతులు ఉద్యాన తోటల సాగు చేస్తూ మేలైన దిగుబడి సాధిస్తున్నారు. అందులోనూ ఫలరాజుగా చెప్పుకునే మామిడి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గల్లో రైతులు మామిడి పంట అధికంగా సాగు చేశారు. ప్రస్తుతం పూత విరబూయడంతో రైతులు దిగుబడిపై ఆశలు పెంచుకుంటున్నారు. పూతను జాగ్రత్తగా కాపాడుకుంటే అధిక ఆదాయం పొందొచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో గతేడాదితో పోలిస్తే ఈ సారి పూత, పిందెలు కాస్త పర్వాలేదనిపిస్తోంది. గతంలోనూ పూత దశలో బాగా ఉన్నప్పటికీ .. వాతావరణంలో అనూహ్యంగా మార్పులు చోటుచేసుకుని పిందెలు రాలిపోయి ఆశించిన దిగుబడులు రాలేదని మామిడి రైతులు అంటున్నారు. మూడు నియోజకవర్గాల్లోనూ సుమారు 8 వేల ఎకరాల్లో మామిడి సాగు చేపట్టారు. జిల్లాలోనే అత్యధికంగా కళ్యాణదుర్గం డివిజన్‌లో 6,500 ఎకరాలకు పైగా పలు రకాల మామిడి సాగులోకి వచ్చింది. మామిడి పూత విరబూయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పూత ఆఖరు దాకా ఇలాగే నిలబడితే ఆశించిన స్థాయిలో దిగుబడి దక్కుతుందని రైతులు భావిస్తున్నారు. పూత బాగా పట్టడంతో దిగుబడులపై రైతులు ఆశలు పెంచుకున్నారు. మునుముందు ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోకుండా ఉండాలని ఆకాంక్షిస్తున్నారు.

పూతదశ కీలకం..

- మామిడి పంటలో పూత దశ కీలకం. పూతను రక్షించుకుంటే ఆశించిన దిగుబడి సాధించొచ్చని ఉద్యానశాఖ అధికారులు చెపుతున్నారు. తెగుళ్లపై అవగాహన పెంచుకొని వాటిని గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటి నుంచే తగిన జాగ్రత్తలు పాటించాలి. మామిడి తోటల్లో రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై అధికారులు సూచించారు.
- పూల మొగ్గ ఏర్పడిన తర్వాతపై పాటుగా ఎరువులు వేసుకోవాలి. చెట్టు వయసును బట్టి సాధారణంగా 500 గ్రాముల నుంచి ఒక కిలో యూరియా, మ్యూరేట్ ఆఫ్, పొటాష్ ఎరువులను వేప పిండితో కలిపి వేసిన తర్వాత 15 రోజుల వ్యవధిలో 3–4 తడులు ఇవ్వాలి.
- సాధారణంగా హార్మోన్ల లోపం ఉండే తోటల్లో పూత, పిందె రాలుతుంది. నాఫ్తలిన్ అసిటిక్ యాసిడ్ (ప్లానోఫిక్) 5.5 లీటర్ల నీటికి 1 ఎంఎల్ లేదా ఫార్ములా–4 ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- బొరాన్ లోపం ఉన్న తోటల్లో బోరాక్స్ 2 గ్రాములు చొప్పున ఒక లీటరు నీటికి కలిపి స్ప్రే చేస్తే పిందెకట్టు పెరుగుతుంది.
- పూత సమయంలో తేనె మంచు, తామర పురుగు, ఆకుచుట్టు, పూతచుట్టు, పిండినల్లి పురుగులు నష్టాన్ని కలిస్తాయి. ఆకుజల్లెడ పురుగు (బల్లి పాతర) చెట్లపై లేకుండా చూసుకోవాలి. తెగుళ్ల ఆశించినట్టు గుర్తిస్తే వెంటనే తగిన మందులు స్ప్రే చేయాలి.
- అలాగే తేనె మంచు, తామర, బూడిద, ఇతర తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా పిందెలు రాలకుండా నివారణ చర్యలు చేపట్టాలి.

పూతను సంరక్షించుకోవాలి



మామిడి పంటకు ప్రస్తుత వాతావరణం అనుకూలంగా ఉంది. ఈ యేడు తోటలు విరగబూసాయి. వచ్చిన పూతన సంరక్షించుకుంటే ఆశించిన ఫల సాయం దక్కుతుంది. మామిడి పూతలో ప్రతి పూల గుత్తిలో 4 వేల నుంచి 6 వేల పూలుంటాయి. ఇందులో 1–3 పూలే కాయగా వృద్ధి చెందుతాయి. పూత సంరక్షణలో వాతావరణ పరిస్థితులు, నీటి, పోషక, యాజమాన్యం, పురుగులు, తెగుళ్ల బెడద, హార్మోన్ల లోపాలు ప్రధాన భూమిక పోషిస్తాయి. ఎలాంటి సమస్యలున్నా ఉద్యాన అధికారుల్ని సంప్రదించాకే మందులను పిచికారీ చేసుకోవాలి. దళారులు చెప్పే మాటలు నమ్మవద్దు. ఫ్రూట్‌కవర్స్ ను రాయితీతో అందిస్తున్నట్లు తెలిపారు.

–మౌనిక, హార్టికల్చర్ అధికారిణి, రాయదుర్గం

హుండీ ఆదాయం రూ.4.79 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

కూడేరు: కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయ హుండీ కానుకలను శుక్రవారం లెక్కించారు. దేవదాయశాఖ డివిజన్ అధికారి వన్నూరు స్వామి పర్యవేక్షణలో ఆలయ హుండీ కానుకలు లెక్కించారు. 9 నెలల కాలానికి రూ.4,79, 664 ఆదాయం వచ్చినట్లు పర్యవేక్షణాధికారి తెలిపారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సాకే రమేష్ బాబు, ఆలయ అర్చకుడు మహేష్, సేవా కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాశాఖ సమస్యలపై సమీక్ష



డీఈఓ, ఎంఈఓతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక ప్రజవేదికలో నియోజవర్గ వ్యాప్తంగా విద్యాశాఖ సమస్యలపై డీఈఓ ప్రసాద్‌బాబు, ఐదు మండలాల ఎంఈఓలతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు మెరుగైన సేవలు ఇవ్వాలని, విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి పరిష్కరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు.

యాజమాన్య పద్ధతులతోనే దిగుబడి



వరి పంట దిగుబడిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సాయికుమార్

బొమ్మనహాళ్: యాజమాన్య పద్ధతిలో వ్యవసాయ పంటలను పండిస్తే మంచి దిగుబడి వస్తుందని మండల వ్యవసాయాధికారి సాయికుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం సమీపంలో సాగు చేసిన వరి పంటను ఆయన పరిశీలించారు. మండల వ్యాప్తంగా 1200 ఎకరాల్లో వరి పంట సాగు చేశారన్నారు. ప్రస్తుతం వరి పంటలో కాండం తొలుచు పురుగు, సుడిదోమ, ఆకు నల్లి, కంకినల్లి, అగ్గి తెగులు, కాండం కుళ్లు తెగులు ఆశించే అవకాశాలు ఉన్నాయన్నారు. కాండం తొలిచే పురుగు నివారణకు క్లోరిఫైరిఫాస్ 2.5 మి.లీ లేక ఆసిఫేట్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. చిరుపట్ట దశలో ఎకరాకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరానికి 8 కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు ఎకరాకు వాడాలన్నారు.

సజావుగా సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలు

బొమ్మనహాళ్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సబ్సిడీ రుణాల దరఖాస్తుదారులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ, కమ్మ, కాపు, ఈబీసీ ద్వారా స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలు మొత్తం 47 యూనిట్లు ఉన్నాయి. వీటికోసం మొత్తం 322 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొదటి రోజు 212 మంది ఇంటర్వ్యూలకు హాజరయిన్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు.

గుమ్మఘట్ట: ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్సిడీ రుణాల దరఖాస్తులు పరిశీలన శుక్రవారం పూర్తయినట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న 71 మంది లబ్ధిదారులను ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బంది , మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పరిశీలించారు.

విడపనకల్లు: మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎంపీడీఓ షకీలాబేగం, బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దాదాపు బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, కాపు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారు 55 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.

కణేకల్లులో కిరాణా దుకాణదారులకు జరిమానా



కిరాణా దుకాణంలో వస్తువులను పరిశీలిస్తున్న తూనికలు, కొలతలశాఖ అధికారి శంకర్

కణేకల్లు: మండల కేంద్రంలోని పలు కిరాణా దుకాణాలను గుంతకల్లు డివిజన్ తూనికలు, కొలతలశాఖ అధికారి శంకర్ శుక్రవారం తనిఖీ చేశారు. స్థానిక మురళీ కిరాణా దుకాణంలో ఎమ్మార్పీ, మ్యానిఫ్యాక్చరింగ్ డేట్, ఎక్స్‌పైర్డ్ డేట్, కస్టమర్ కేర్ నంబర్స్ లేని ఈజీ స్పెషల్ గోల్డ్ సిగరెట్స్ విక్రయిస్తుండటంతో యజమానికి రూ.10 వేలు జరిమానా విధించారు. జగదీష్ కిరాణా దుకాణంలోనూ ఈజీ లైట్ సిగరెట్స్‌పై ఎలాంటి వివరాలు లేకపోవడంతో రూ.10వేలు జరిమానా విధించారు. గుండ్లపల్లి క్రాస్‌లో హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లు వినియోగదారులకు వేయింగ్ మిషన్‌లో తూకం వేసి ఇవ్వకుండా నేరుగా డెలివరీ ఇస్తుండటంతో ఏజెన్సీ నిర్వాహకుడికి రూ.15 వేలు జరిమానా వేశారు.

తెలుగు భాషను పరిరక్షించుకుందాం



పాలికిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జేవీవీ నాయకులు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. తెలుగు విభాగం శాఖాధిపతి ఎం.పరమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత తెలుగు సీనియర్ ఉపాధ్యాయులు, ఆధ్యాత్మికవేత్త ఆర్.కృష్ణయ్య హాజరయ్యారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వపు పోటీల్లో విజేతలకు వైస్ ప్రిన్సిపాల్ మస్తానప్ప, ముఖ్య అతిథి కృష్ణయ్య బహుమతులు అందించారు.

విడపనకల్లు: తెలుగు భాషను పరిరక్షించుకుందామని జేవీవీ వ్యవస్థాపక అధ్యక్షుడు వి. గంగరాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని పాలికి గ్రామంలో అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్, భోజరాజు, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, వీణాకుమారి, సుధా కల్పన తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మాతృభాష దినోత్సవాన్ని తెలుగు, హిందీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్, శ్రీధర్, కవిత, శశికిరణ్, రవిశంకర్, సుధాకర్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవిప్రసాద్

వజ్రకరూరు: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ రవిప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని రాగులపాడు గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పీ–4 సర్వేలో వెనుకబడి ఉండటంతో సంబంధిత కార్యదర్శికి షోకాజ్ నోటీస్ జారీ చేస్తామన్నారు. అనంతరం ఎంపీడీఓ రవిప్రసాద్ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలని అన్నారు. సమస్యలు అడిగి తెలుసుకొని, ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి, మలేరియా సబ్‌యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం



పాటిల్ శ్రీనివాస్

ఉరవకొండ: ఉరవకొండ పట్టణ, రూరల్ వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం వచ్చినట్లయ్యింది. వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందాయి. ఈసందర్భంగా నూతన అధ్యక్షులు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై. విశ్వేశ్వరరెడ్డికి వారు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

పట్టణ అనుబంధ సంఘాల అధ్యక్షులు వీరే..: యువజన విభాగం–సింగాడి ధనరాజ్, మహిళా విభాగం–కురుబ లక్ష్మీదేవి, రైతు విభాగం–కురుబ పెద్ద రాజప్ప, బీసీ విభాగం–జోగి హనమంతు, ఎస్సీ విభాగం– మీనుగ గంగాధర్, మైనార్టీ విభాగం–ఎంఏ జిలాన్, పంచాయతీరాజ్ విభాగం– రాయల్ మల్లికార్జున, ఆర్‌టీఐ విభాగం–ఉప్పర భాస్కర్, వలంటీర్ విభాగం– రాజశేఖర్, వాణిజ్య విభాగం–గంధోడి మారేష్, వైఎస్సార్‌టీఎఫ్ విభాగం–ఎర్రిస్వామి, సాంస్కృతిక విభాగం–జోగి వెంకటేష్, సోషల్ మీడియా విభాగం–శంకర్, వికలాంగుల విభాగం–వడ్డే ఆంజనేయులు, ప్రచార విభాగం–బలిజ సతీష్, చేనేత విభాగం–కొత్తపల్లి హరినాథ్, కార్మిక విభాగం– వన్నూర్‌సాబ్ ఎంపికయ్యారు.

రూరల్ అనుబంధ సంఘాల అధ్యక్షులు వీరే..: యువజన విభాగం– ఆమిద్యాల ఉదయ్‌రెడ్డి, మహిళా విభాగం–తలారి సుంకమ్మ, రైతు విభాగం–నింబగల్లు రమేష్, ఎస్సీవిభాగం–ఆమిద్యాల మల్లప్ప, మైనార్టీ విభాగం – ఆమిద్యాల దాదా, క్రిస్టియన్ విభాగం–నింబగల్లు శిరోమణి, విద్యార్థి విభాగం–రాకెట్ల అరవింద్, పంచాయతీ రాజ్ విభాగం – నింబగల్లు సర్పంచ్ ఓబుశేసు, ఆర్‌టీఐ విభాగం–షేక్షానుపల్లి రంజాన్‌సాహెబ్, వాలంటీరీ విభాగం– రాయంపల్లి దిలీప్‌రెడ్డి, వాణిజ్య విభాగం–రేణుమాకుపల్లి వీరభద్రప్ప, కార్మిక విభాగం – లత్తవరం భీమ్‌రాజ్, సాంస్కృతిక విభాగం–ముస్టూరు ఈడిగబాబు, సోషల్ మీడియా విభాగం–రేణుమాకుపల్లి సుధా నియమితులయ్యారు.

బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పాటిల్

బెళుగుప్ప: మండల సీనియర్ నాయకుడు పాటిల్ శ్రీనివాస్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందాయి. పాటిల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తనను బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీను మరింత బలోపేతం చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలతో మరింత చురుగ్గా పనిచేస్తామన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



ఆలేరి రాజగోపాల్‌రెడ్డిని శాలువా కప్పి సన్మానిస్తున్న మండల నాయకులు

కణేకల్లు: మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పార్టీ అధిష్టానం శుక్రవారం నియమించింది. ఈసందర్భంగా ఆలేరి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా రాయదుర్గం మాజీ మున్సిపల్ చైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి, నాయకులు ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, హళ్లి నాగరాజు తదితరులు ఆలేరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

సంక్షిప్త సమాచారం

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

బ్రహ్మసముద్రం: మండలంలోని గోవిందయ్య దొడ్డిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త డ్రైవర్ శ్రీనివాసులు (32) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి, మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ బుసప్ప, మాజీ మండల కన్వీనర్ బసవరాజు శ్రీనివాసులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ నాయకులు బీటీపీ ఆయకట్టు మాజీ చైర్మన్ దేవన్న, చెలిమేపల్లి ఆంజనేయులు, ఎంపీటీసీ బుసప్ప, నాయకులు మంజు , అయ్యన్న, మహ లింగ, శరణప్ప,వెంకటేశులు నివాళులర్పించారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

వజ్రకరూరు: మండల కేంద్రానికి చెందిన సోహబ్ అకీర్ అనే బాలుడు జనవరి 27 నుంచి కనిపించలేదని అతని తల్లి శర్మాస్‌బీ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి శుక్రవారం తెలిపారు. ఇంటి నుంచి బళ్లారికి వెళ్తున్నట్లు చెప్పి ఇప్పటికీ తిరిగి రాలేదన్నారు.

పరిహారం చెల్లించాలని వినతి

కుందుర్పి: అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే మంటలు వ్యాపించి, కాలిపోయిన వ్యవసాయ పరికరాలు, మోటారు బైక్‌కు పరిహారం ఇవ్వాలని బాధిత రైతు హరిజన లక్ష్మమ్మ అటవీ, వ్యవసాయాధికారులకు శుక్రవారం విన్నవించింది. కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ రేంజర్ మధుబాబుకు వినతి పత్రం అందించినట్లు రైతు లక్ష్మమ్మ తెలిపింది.

గవిమఠం ఆవరణలో చలువ పందిళ్ల ఏర్పాటు

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి సన్నిధిలో చలువ పందిళ్లను శుక్రవారం ఏర్పాటు చేస్తున్నారు. పనులను గవిమఠం సహాయ కమిషనర్ కె.రాణి, మఠం సిబ్బంది నారాయణస్వామి, శంకర్‌తో కలిసి పరిశీలించారు. సహాయ కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 26న మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

27న రాతిదూలం లాగుడు పోటీలు

కూడేరు: మండలంలోని మరుట్ల–3 కాలనీలో మహాశివరాత్రి సందర్భంగా చితంబర స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27న జిల్లా స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, గ్రామ పెద్దలు శుక్రవారం తెలిపారు. మొదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, 3వ బహుమతి రూ.20 వేలు, నాల్గో బహుమతి 10 వేలు ఉంటుందన్నారు. వివరాలకు సెల్: 9505589193, 9542466332లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: సబ్సిడీ పథకాలను ఉద్యాన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన అధికారి కృష్ణతేజ తెలిపారు. శుక్రవారం ఈస్ట్‌కోడిపల్లిలో మామిడి తోటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు సబ్సి డీ తో స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు అందిస్తున్నట్లు తెలి పారు.

వడదెబ్బ ప్రాణాంతకం

బొమ్మనహాళ్: వడదెబ్బను నిర్లక్ష్యం చేస్తే ప్రాణపాయం కలగొచ్చని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారులు కుమారరాజా, గీతాభార్గవి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో వడదెబ్బ, సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ చేశారు. ఎండవేడిమితో శరీర ఉష్ణోగ్రతలు పెరిగి, మెదుడుపై చూపే ప్రభావంతో వడదెబ్బకు గురవుతారన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పంట దిగుబడి పెంపునకు చర్యలు

ఉరవకొండ: నూనె గింజల పంట దిగుబడులు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఏఓ శుభకర్ తెలిపారు. శుక్రవారం షేక్షానుపల్లి గ్రామంలో జాతీయ నూనె గింజల మిషన్ పథకంలో భాగంగా రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కే సిబ్బంది చిక్కన్న, గోపాల్ నాయక్, భీమేష్, వన్నప్ప పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

వజ్రకరూరు: వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉండొచ్చని ఎంపీడీఓ రవిప్రసాద్, మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండ రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం రాగులపాడు, పందికుంట, వెంకటాంపల్లిపెద్దతండా తదితర గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రాగులపాడులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంపీడీఓ రవి ప్రసాద్ హాజరయ్యారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి, సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, ఉమామహేశ్వరి, శివాజీనాయక్, గ్రామకార్యదర్శి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాలంచెల్లిన కూల్‌డ్రింక్స్ విక్రయం

బొమ్మనహాళ్: ఎండలు మొదలయ్యాయి. జనం శీతలపానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీన్ని అదునుగా చూసుకొని వ్యాపారులు కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ విక్రయిస్తున్నారు. ఉద్దేహాళ్‌కు చెందిన ఓ వ్యక్తి థంప్సప్ లీటర్ బాటిల్ కొనుగోలు చేసి తాగడంతో కొద్దిసేపటికే తేడాగా అనిపించింది. దాని డేట్ పరిశీలించగా గతేడాది డిసెంబర్ 1 నాటికే కాలం చెల్లిపోయిందని గుర్తించాడు. దుకాణదారుడిని బాధితుడు ప్రశ్నించగా డీలర్ తెచ్చి ఇచ్చిన సరుకు మాత్రమే అమ్ముతున్నామని బుకాయించాడు. దీనికితోడు కూల్‌డ్రింక్ బాటిల్ ఎమ్మార్పీ కంటే అధికంగా కూలింగ్ చార్జీల పేరుతో మరో రూ.15 అదనంగా వసూ లు చేస్తున్నట్లు వినియోగదారులు చెప్తున్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

బొమ్మనహాళ్: చంద్రగిరికి చెందిన కృష్ణమూర్తి శెట్టి కుటుంబానికి న్యాయం చేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులతో ధర్నా చేశారు. బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ కృష్ణమూర్తిశెట్టి భూ సమస్య పరిష్కారం కోసం సర్వే చేయాలని చలానా కట్టి నెలలు గడిచినా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కృష్ణమూర్తిశెట్టి హత్య గావింపబడ్డాడన్నారు. ఆ కుటుంబానికి ఇప్పటికీ రెవెన్యూ అధికారులు న్యాయం చేయలేదన్నారు. తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ సర్వే చేసి సమస్య పరిష్కరించడానికి వారం రోజులు పడుతుందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు జయచంద్ర, కార్యదర్శి కృష్ణ, ఉరవకొండ ఇన్‌చార్జి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.